**ఘనతను గుర్తించి అభినందించటమూ ఔన్నత్యమే!**

# పైచేయి

ఎవరో చెప్పారంటూ మూర్తి ఫోనులో చెప్పిన వార్తకు నిశ్చేష్టుడినయ్యాను! పరమేశం తన కొంపాగూడూ, పొలంపుట్రా... అలా ఎక్కడెక్కడో వున్న ఆస్తులన్నిటినీ తెగనమ్ముకుని చివరకు ఎవరి పొలాల్లోనో పనిచేసుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడట! పైకి నేను "అయ్యో... అలాగా" అన్నాను గానీ మనసులో మాత్రం వెర్రి ఆనందంతో గంతులు వేశానన్నది నిజం!

నేను అమెరికాలో ఉండగానే మధ్యవర్తుల ద్వారా రెండేళ్ళ క్రితం కొనుగోలు చేసిన ఇంటికి ఏవో మార్పులూ చేర్పులూ చేయిస్తూ, ఇక ఇక్కడే స్థిరపడదామని హైదరాబాద్ వచ్చేశాను. ఇపుడు ఆ రాజమందిరం లాంటి ఇంటిని అడుగడుగూ పట్టి పట్టి చూసుకుంటూ ఎంత మురిసిపోయానో... మూర్తి చెప్పిన కబురుకు అంతకు రెట్టింపుగా మైమరిచిపోయాను! పరమేశం నాకు శత్రువని అనుకునేరు... కానేకాదు.. ప్రియమిత్రుడు! అవును... నిజం!

హైస్కూలు రోజుల్లో క్లాసులో వాడిదెపుడూ ఫస్టు ర్యాంకయితే నాది సెకండు అయ్యేది.. ఒక్కసారన్నా ఫస్టు రావాలి, వాడికంటే పై మెట్టుమీద నిలబడాలనే నా గాఢమైన కోరిక ఒకసారి హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్‌లో తీరింది కానీ ఆ ఆనందం ఎంతసేపు నిలబడలేదు. సైన్సు మాష్టారు వాడిని ఏదో ప్రశ్న గురించి "క్లాసులో ఇంత బాగా సమాధానం చెప్పినవాడివి పరీక్షలో రాయటానికేమైందిరా... బద్ధకమా?" అని నిలదీసేసరికి, నా వేపు ఒకే ఒక సెకను సేపు చూసి మాట్లాడకుండా తలదించుకున్నాడు. నాకు ఛెళ్ళు మంది. ఛ...! మనసులోనే గింజుకున్నాను. "ఎందుకు చేశావిలా?" అని కోపంగా అడిగితే "ఫస్టు వచ్చాననే ఆనందం నా స్నేహితుడిలో చూడాలనే నా కోరిక తీర్చుకోవడం కోసమేరా..!" చిరునవ్వుతో అన్నాడు. ఇంకేం మాట్లాడగలను!

అలాంటి సందర్భాలు ఆ తర్వాత జీవితంలోనూ ఎదురయ్యాయి. ఇచ్చేవాడిదెపుడు పైచేయిగా ఉంటుంది. వాడిపై ఒక్కసారి... ఒక్కసారన్నా నాది పైచేయి కావాలనే కోరిక అడుగు దూరంలో ఉంటూ వూరించటమే కానీ తీరలేదు!

ఇద్దరం అమెరికా వెళ్ళిపోయాం. చెరోమూల అవటంతో కలుసుకునే సందర్భాలు తగ్గాయిగానీ, కబుర్లు మాత్రం అపుడపుడూ తెలుస్తూనే ఉన్నాయి. వాడి పరిస్థితి బ్రహ్మాండంగా ఉందని విన్నాను. నాలుగేళ్ళ క్రితం ఒకసారి ఫోనుచేసి మా వూరెళ్ళిపోతున్న సంగతి చెప్పి “సంపాదించింది ఇక చాలనిపిస్తోందిరా... కాలక్షేపం కోసం ఏ షేర్ బిజినెస్సో చేస్తూ ప్రశాంతంగా గడిపేస్తాను” అన్నాడు. ఒక్కోసారి వ్యాపారాల్లో లాభాలు ఎలా వస్తాయో, అలాగే నష్టాలు కూడా రావటం మొదలైతే ఆ పరంపర అలాగే కొనసాగుతుంది... ఆగదు! అలాంటి సమయాల్లో ఏవైనా దురలవాట్లు కూడా అలవడితే ఇక చెప్పేదేముంది... ఆర్థికంగా ఎవరెస్టు శిఖరం మీదున్న మనిషైనా అథఃపాతాళానికి జారిపోక తప్పదు! పరమేశానికీ అలాగే జరిగి ఉంటుంది!

ఇన్నాళ్ళకు... నా చిరకాల వాంఛ తీరబోతోంది! అర్జెంటుగా పరమేశాన్ని కలవాలి. వాడు కోరినంత జీతంతో నా దగ్గర ఉద్యోగం ఇచ్చి... నా భవంతిలోనే సకల సౌకర్యాలతో దర్జాగా ఉండొచ్చని చెప్పాలి! నాలో ఉత్సాహం ఉరకలు వేసింది!

ప్రయాణానికి సిద్ధమౌతుంటే నా సెక్రటరీ వెంకటేశం చిన్న మార్పు సూచించాడు. మా వూరుకు వెళ్ళే దారిలో వున్న ముత్యాలపల్లెలోనే నాకు బిల్డింగును అమ్మిన స్వామి ఉంటున్నారు కాబట్టి, ఆయన్ను ఒకసారి మర్యాదపూర్వకంగా కలిసివెళ్తే బావుంటుందన్నాడు. అతను చెప్పిన ధరకి మేం బాగా తగ్గించి అడిగినా బేరసారాల్లేకుండా అంగీకరించిన ఆ పెద్ద మనిషికి ‘థాంక్స్’ చెప్పినట్లుగా కలవటం అవసరమేనని నాకూ అనిపించటంతో సరేనన్నాను.

మా కారు ప్రయాణంలో వెంకటేశం ఆ స్వామి గురించే చెబుతున్నాడు. ‘ఆ స్వామి బాగా ధనవంతుడు కాబోలు తుపానులో నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయిన ఆ వూరుని మంచిరోడ్లు, అన్ని సదుపాయాలూ వున్న చక్కని పక్కా ఇళ్ళతో తీర్చిదిద్దటంతోపాటు రెండొందలకు పైగా వున్న రైతుకూలీ కుటుంబాలకి కొంతకొంతగా సొంత పొలాన్నీ సమకూర్చి ఇచ్చాడట!’ ఇంకా చుట్టుపక్కల వూళ్ళ వారందరికీ కూడా ఉపయోగపడే విధంగా పెద్ద హాస్పిటల్, హైస్కూలు కూడా కట్టించాడట!’ వెంకటేశం మాటల్లో చెప్పాలంటే... ఆ జనం అందరి గుండెల్లో గుడి కట్టుకుని కొలువై వున్న దేముడు ఆ స్వామి!

మా కారు ఆ వూళ్ళోకి ప్రవేశించగానే వెంకటేశం మాటలు పూర్తిగా నిజమేనని నాకూ అర్థమైంది! అంత చక్కగా, ఆధునికంగా వున్న ఆ వూరుని చూసి ముగ్ధుడినయ్యాను! కారును ఒకచోట ఆపి, ఆయన్ను వెతికి పట్టుకోవాలంటూ వెంకటేశం వెళ్ళాడు. కాసేపటిలోనే దూరంగా వున్న పొలాలవేపు నుండి వెంకటేశంతో వస్తున్న వ్యక్తి దగ్గరగా రాగానే నేను నిర్ఘాంతపోయాను! అతను... మా పరమేశమే!!

నా ఆశ్చర్యాన్ని గమనించి... దగ్గరలో వున్న పెద్దచెట్టు చుట్టూ వున్న గచ్చుపై నన్ను తనతో కూర్చోబెట్టుకుని పరమేశం తన విషయాలన్నీ వివరించాడు. ఒకరోజు అటుగా కారులో వస్తున్నపుడు...

తుపానులో సర్వం కోల్పోయి చెట్లక్రింద, గుడారాల్లోనూ ఉంటున్న ఆ కూలీల కుటుంబాల్ని చూశాక, హైద్రాబాద్‌లో ఉన్న తన కొత్త ఇంటిని అమ్మేస్తే, వాళ్ళందరికీ పక్కా ఇళ్ళు వస్తాయి కదా అనిపించిందట! ఆ ఆలోచన కలిగిన క్షణం ఎలాంటిదో గానీ, ఇక ఆలశ్యం చేయకుండా ఆచరణలో పెట్టేశాడు. ఆ పనిలోని ఆనందం అనుభవంలోకి వచ్చాక, మిగతా ఆస్తులన్నీ అమ్మేసి, స్కూలు, హాస్పిటల్ కట్టించాడు. పిల్లలు వాళ్ళ సంపాదనతో సుఖంగానే ఉన్నారు కాబట్టి తానొక్కడూ ఇక్కడ వాళ్ళ పొలాల్లోనే తిరుగుతూ తోచిన సలహాలిస్తూ, వాళ్ళతో కలిసి పనిచేస్తూ కాలం గడుపుతున్నానని చెప్పాడు.

వాడి మాటలు వింటూంటే నాకు కలిగిన దిగ్భ్రాంతి అంతా ఇంతా కాదు!

నాకని తెలిసే పరమేశం ఆ బిల్డింగును సంకోచించకుండా తక్కువ ధరకి అమ్మాడన్నమాట! నాకు మళ్ళీ ఛెళ్ళుమంది! ఛ... ఛ... మనసులోనే గింజుకున్నాను.

అంతలోనే నాకో విషయం స్ఫురించింది! నేను భ్రమపడ్డాను గానీ పరమేశం కంటే నాదే పైచేయి... నేను తనకంటె ఒక మెట్టు పైనే ఉన్నాను! విజయగర్వంతో నా ఛాతీ ఉప్పొంగింది! నిలువెల్లా పులకించి పోయాను! నేను తనకంటె పై మెట్టు మీద ఉన్నాననే మాటను పరమేశంతో గర్వంగా చెప్పగానే వాడు తన సహజమైన నిర్మలమైన చిరునవ్వుతో" అది నాకూ సంతోషం కలిగించే విషయమని నీకూ తెలుసు కదరా..." అన్నాడు.

రెండు చేతులతో పరమేశాన్ని ఆలింగనం చేసుకుంటూ ఆర్ద్రంగా అన్నాను "ఇంత గొప్ప మానవతా విలువలున్న స్నేహితుడు నాకున్నాడు!! నీకు లేదు! అందుకే నేను పై మెట్టు మీదున్నాను! నాదే పైచేయి!" ఆ మాటలు అంటున్నపుడు ఆనందంతో నా కనులు చెమరించడమే కాదు. మనసు కూడా తడిసి తడిసి చిత్తడి అయిపోయింది!

తాము దేముడిలా భావించే పరమేశాన్ని ఆ వూరి వాళ్ళందరూ భక్తితో 'స్వామీ!' అని పిలుస్తారన్నమాట!

❊ ❊ ❊

**'నది మంత్లీ' జనవరి 2014**